

భార్యాభర్తల మధ్య అవగాహన లోపించినప్పుడు, అసలు జీవితమంటే ఏమిటోకూడా తెలుసుకోకుండా అహాన్ని ప్రదర్శించినప్పుడు ఏమవుతుందో ఈ కథ వెల్లడిస్తుంది.

# రాజీ

శారద పుట్టింటికి వెళ్ళిపోయి మూడు నెలలైనా శ్రీధర్ పట్టించుకోలేదు. 'ఎప్పుడు తన మాటను గౌరవిస్తుందో, ఎప్పుడు తనకు భర్త కావాలనుకుంటుందో అప్పుడే తిరిగి వస్తుంది. లేకపోతే అక్కడే ఉండిపోతుంది. ఈ విషయంలో మాత్రం రాజీ కుదరదు' అనుకున్నాడు. శారద కూడా అలాగే 'ఎప్పుడు తన భర్త తనను కావాలనుకుంటాడో, ఎప్పుడు తన మాటను గౌరవిస్తాడో అప్పుడే మళ్ళీ తను ఆ గుమ్మం తొక్కడం' అనుకుంది.

శారద తల్లిదండ్రులు కూడా కూతురికి శతవిధాల నచ్చజెప్పారు. 'భర్త ఎటువంటి వాడైనా భార్య సర్దుకుపోవాలి' అన్నారు. చిన్నతనం...ఇటువంటి కీచులాటలు సహజమన్నారు. ఇలా విడాకులు తీసుకున్న వాళ్ళలా ఉంటే నలుగురిలో చులకనై పోతారన్నారు. వాళ్ళెన్ని చెప్పినా శారద వినలేదు.

"చూడండి. జరిగిందంతా వివరంగా చెప్పాను. ఇప్పుడు కూడా మీకు నేను బరువనుకుంటే చెప్పండి. నా దారి నేను చూసుకుంటాను. అంతేకానీ ఆత్మగౌరవం చంపుకుని మళ్ళీ ఆ గుమ్మం తొక్కను. నా అవసరం ఆయనకు ఏర్పడి నేను కావాలనుకుంటే తనే వచ్చి తీసుకు వెళ్ళనియ్యండి" అంది కచ్చితంగా.

మరి కూతురితో మాట్లాడి లాభం లేదని తెలుసుకున్న శారద తల్లిదండ్రులు ఊరుకున్నారు. కూతురి మొండితనాన్ని తమ సలహాలు మార్చలేవనుకున్నారు. అల్లుడే మనసు మారి రావాలని కూడా ఆశలు పెట్టుకున్నారు. ఏమీ చెయ్యలేని పరిస్థితిలో నిస్సహాయులై మనసులోనే వారు కుమిలిపోయారు.

చిత్రాలు: పి.యస్. బాబు



ఆదివారం ఇంట్లో తన గదిలో కూర్చుని ఆఫీసు గురించి ఆలోచిస్తున్నాడు శ్రీధర్. సరిగ్గా అదే సమయంలో శారద కూడా తన పుట్టింట్లో కూర్చుని శ్రీధర్ గురించి ఆలోచిస్తూంది.

"ఒరేయ్! ఎంతకాలమని ఇలా ఉంటావు? వెళ్ళి కోడలుపిల్లను పిల్చుకు రారా. ఇలాగే ఉంటే నలుగురిలో లోకువై పోతారు" అంది శ్రీధర్ తల్లి కామాక్షమ్మ. చూస్తూ చూస్తూ నెలలు దొర్లిపోతున్నాయని ఆమె బాధ.

"నీకు తెలీదమ్మా ఆవిడ సంగతి. ఎంతసేపూ ప్రతి విషయంలోనూ తన మాటే గెలవాలనుకుంటుంది. ఛ.ఛ. ఆవిడ ఊసు ఎత్తకు. ఈ ఇంట్లో నేను మగవాడా లేక తనా? నా మాటకు తలవంచని భార్య నాకు వద్దు" అన్నాడు శ్రీధర్ విసురుగా.

సరే, వీడితో లాభం లేదనుకుంది కామాక్షమ్మ. 'ఈ కాలం కుర్రకారుకి పెళ్ళాల విలువ ఏం తెలిసి చచ్చింది కనుక. జుత్తు నెరవడం మొదలైతే కానీ భార్య స్థానం ఏమిటో చాలా మందికి తెలియదు. పెళ్లయిన చిన్నతనంలో భార్య ఒక ఆటబొమ్మగా, ఆ తర్వాత జీతం లేని వంటమనిషిగా అనిపిస్తుంది చాలామందికి. కానీ ఆ భార్యే భర్త జీవితానికి ఊపిరి అని ఎందరు గమనిస్తున్నారు' అనుకుంది కామాక్షమ్మ.

అలా విడిపోయిన శారదా శ్రీధర్‌లు నెలల తరబడి ఒకరికొకరికి సంబంధం లేకుండా బ్రతుకుతున్నారు. ఆత్మగౌరవం అనే భ్రమలో పడిపోయారు.

నిజానికి శారద తన పుట్టింటికి వెళ్ళిపోవడం ద్వారా తనకు తగిన స్థానాన్ని తన భర్త తనకు ఇవ్వడం లేదని అతనికి తెలిసేలా చేసింది. శ్రీధర్‌తో పెళ్ళయి రెండేళ్ళైంది. కాపురానికి వచ్చిన దగ్గర్నించీ ఈ రెండేళ్ళలో ఎన్నోసార్లు అర్థం పర్థం లేని దెబ్బలాటలు, కీచులాటలు, పరుషమైన సంభాషణలు వాళ్ళిద్దరి మధ్య చోటు చేసుకున్నాయి. ప్రతి చిన్న విషయంలోనూ శ్రీధర్ 'తప్పే' కనిపెట్టేవాడు. వంటలో తప్పు...ఇంటి పనుల్లో తప్పు...ఆడే మాటలో తప్పు...చేసే చేతలో తప్పు...ఇలా ఎప్పటి కప్పుడు ఏదో వంకతో సాధించుకుతింటూ, మనస్పర్థలు పెంచేవాడు. అడపా దడపా శారద కూడా ఎదురు తిరిగేది. ఓ మాట ఎక్కువగానే మాట్లాడేది. ఆమె భావన ఒక్కటే. 'ఆడదైనంత మాత్రాన అలుసుగా ఎందుకు చూడాలి? తను అతని భార్య. వ్యక్తిత్వం ఉన్న మనిషి. తనమీద అతనికి అధికారం ఉంది. అయినా అతను ఆ అధికారాన్ని ఒక యజమాని తన నౌకరు మీద ప్రయోగించే అధికారంలా ఎందుకు ప్రయోగించాలి?' అనుకుంది. అందుకే అతని ప్రవర్తనతో విసిగిపోయి పుట్టింటికి వెళ్ళిపోయింది, ఇక్కడ ఎంత సుఖపడుతున్నానో అక్కడా అంతే ననుకుంటూ.

కొత్తగా వచ్చిన మేనేజర్ పిలుస్తున్నారని శ్రీధర్‌తో చెప్పాడు ప్యూన్. తలవంచుకుని లెడ్జర్‌లో కుస్తీ పడుతున్న శ్రీధర్ వెంటనే లేచి మేనేజర్ గదిలోకి వెళ్ళి నిలబడ్డాడు. అతని రాకను గమనించి చూస్తున్న ఫైలును విసురుగా టేబిల్ మీదికి విసిరేసి- "మిస్టర్ శ్రీధర్? మీరు పార్టీలకు రాసిన ఉత్తరాలలో ఎన్నో తప్పులున్నాయి. పైగా వాటితో జత చేసిన స్టేట్‌మెంట్స్ అన్నీ తప్పులే. ఎనిమిదేళ్ళ నుంచి పని చేస్తున్నారని మీ రికార్డ్స్ చెప్తున్నాయి. కానీ, మీ వర్క్ అలా కనిపించడం లేదు. వర్క్‌లో ఏకాగ్రత చూపకపోతే మిమ్మల్ని ట్రాన్స్‌ఫర్ చేయాల్సి వస్తుంది. మీకిది మొదటి వార్నింగ్" అంటూ కటువుగా మాట్లాడింది మందాకిని. ఆమె అలా కోపంగా మాట్లాడుతుంటే శ్రీధర్ మొహం ఎర్రబడింది. కళ్ళు చింత నిప్పులయ్యాయి. 'ఆఫ్టరాల్...ఒక ఆడది. తనను 'వార్న్' చెయ్యడమా. ఈవిడ అంతు చూడాలి' అనుకున్నాడు.

"ఓ.కె.మేడమ్. ఆ ఉత్తరాలివ్వండి. మళ్ళీ రాస్తాను. స్టేట్‌మెంట్స్ కూడా మళ్ళీ తయారు చేస్తాను. స్టాఫ్ ప్రాబ్లమ్ కొంచెం ఎక్కువైంది. లేకపోతే నా పనిలో తప్పులు రావు. అయినా ఇంప్రూవ్ చేస్తానండి" అని ముక్తసరిగా అన్నాడు.

అతని చేతికి లెటర్స్ ఇస్తూ "యు కెన్ గో" అంది

మందాకిని. వయసు ముప్పైలోపే అయినా మంచి సమర్థురాలని పేరు సంపాదించింది మందాకిని. తెలివితేటల్లోనే కాకుండా అందంలో కూడా మందాకిని అందరికన్నా ఒక మెట్టు పైనే ఉంది. కూర్చున్న సీటుకు తగ్గ హుందాతనం ఉంది మందాకినిలో. అధికారంతోపాటు తన పనిమీద నమ్మకంకూడా ఉండడం మూలాన ఆఫీసులో అందరినీ శాసించడానికి వెనుకాడదు ఆమె.

బయటికి వచ్చిన శ్రీధర్‌తో సదాశివం "ఏరా! పూజ అయిందా" అని వెక్కిరింపుగా అడిగాడు. "ఏం? నీకూ పడ్డాయా అక్షింతలు" అడిగాడు శ్రీధర్.

"మొదట్లో పడ్డాయి. తర్వాత అడ్జెస్ట్ అయిపోయాను" అన్నాడు శివం. "ఛ!ఛ! ఈవిడ ఇంత 'రూడ్'గా ఉండడం బాగో లేదురా. మగాళ్ళంటే అంత నీచంగా మాట్లాడుతుందేం?" అడిగాడు శ్రీధర్.

"మగాళ్ళంటే నీచంగా మాట్లాడడం కాదురా. మనం తప్పులు చేస్తే పిలిచి మందలిస్తుంది. అంతే" అన్నాడు శివం. తర్వాత మళ్ళీ తనే అన్నాడు: "చూడరా! నువ్వు మామూలు ఉద్యోగివి ఆవిడ మేనేజర్. మందలించినా, తిట్టినా, వార్నింగ్ ఇచ్చినా ఆమెతో సర్దుకుపోక తప్పదు నీకు. కాదూ, కూడదూ అంటే బదిలీ, బర్తరఫ్ అని కష్టాల పాలవుతావు. అందుకే మంచి సలహా చెప్తా విను. ఆమె తిడితే విను...జవాబు చెప్పకు. ఒకవేళ చెప్పినా 'యస్...యస్...' అను... ఇంప్రూవ్‌మెంట్ చూపిస్తా మేడమ్ అను. ఆమెతో రాజీపడి నేను హెడ్ గుమాస్తా కాగలిగాను బెంగుళూర్ బ్రాంచ్‌లో." చెప్పాడు శివం.

"అంటే ఆమె తిడితే పడి...ప్రమోషన్ సంపాదించు కున్నానంటావు." అడిగాడు శ్రీధర్.

"కాదు...ఆమె తిట్టిందని ఆవేశపడకుండా, ఎందుకు తిట్టిందో తెలుసుకుని, సరిదిద్దుకుని...ఆమె ప్రవర్తనతో రాజీపడ్డాను. అంతే" అన్నాడు శివం.

శివం మాటలు శ్రీధర్‌కు అర్థమయ్యాయి.

ఆ తర్వాత కూడా అప్పుడప్పుడు మందాకిని శ్రీధర్‌ను పిలిచి మందలించేది. కానీ శివం మాటలు గుర్తుకు వచ్చి, ఆమె మాటలకు ఎదురు చెప్పకుండా అమె చెప్పినట్లే చేసేవాడు శ్రీధర్. ఫలితంగా మరో మూడు నెలలలో శ్రీధర్‌లో మంచి మార్పును చూసింది మందాకిని. తర్వాత తర్వాత అతన్ని తిట్టడం కానీ, మందలించడం కానీ చేసేది కాదు. చెప్పిన పని సవ్యంగా చేసినప్పుడు 'గుడ్' అని ప్రోత్సహించేది కూడా.

మేనేజర్‌లో వచ్చిన మార్పు శ్రీధర్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది. తనకు సలహా ఇచ్చిన శివం లౌక్యం తెలిసినవాడు అనుకున్నాడు.

ఆదివారం ఇంట్లో తన గదిలో కూర్చుని ఆఫీసు గురించి ఆలోచిస్తున్నాడు శ్రీధర్. సరిగ్గా అదే సమయంలో శారద కూడా తన పుట్టింట్లో కూర్చుని శ్రీధర్ గురించి ఆలోచిస్తూంది. శారద గదిలో కుట్టు మిషను ఉంది. ఇంతలో తలుపు చప్పుడు కావడంతో తలెత్తి చూసింది శారద. లోపలికి వచ్చిన శేఖరం "ఏమండీ! కుట్టడమైందా" అని అడిగాడు.

"ఇంకా లేదండీ! సాయంత్రానికి రెడీ అవుతుంది" చెప్పింది శారద.

"ఏమిటండీ సాయంత్రం? నిన్నడిగితే ఈవేళ అన్నారు. ఇప్పుడు అడిగితే సాయంత్రం అంటున్నారు. ఆడవాళ్ళు కదా అయ్యో పాపం అనుకున్నాను. కానీ మీరిలా నాలుగుసార్లు తిప్పిస్తారని తెలియలేదు. చూడండి, మీకు చేతనైతే కుట్టివ్వండి. లేకపోతే క్లాత్ తిరిగి ఇచ్చేయండి." అన్నాడు కోపంగా.

అతని మాటలు విన్న శారదకు ఆవేశం వచ్చింది. కోపం కూడా వచ్చింది. అయినా సర్దుకుంది

"ఇదిగో...చూడండి. కత్తిరించేశాను కూడా. కుట్టి...హుక్స్ పెట్టాలి. అంతే. సాయంత్రానికి రెడీ అయిపోతుంది. రాత్రి కరెంట్ లేదు. పొద్దున్న నాన్నగారిని హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళవలసి వచ్చింది. ఇప్పుడు పని ప్రారంభించాను." చెప్పింది శారద.

"చూడండి. మీ కష్టాలు మీరు చెప్తున్నారు. నేనింటికి వెళ్తే, మా ఆవిడ నన్ను తిడుతుంది. అనవసరంగా మీ మూలాన నేను... ఛీ...ఛీ...ఏం బేరమో" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు శేఖరం.

అతను వెళ్ళిన తర్వాత అతని మీద శారదకు కోపం ముంచుకు వచ్చింది. 'ఒక్కరోజు లేటైనంత మాత్రాన అర్థం చేసుకోని ఇతను, భార్యకు భయపడి నన్ను తిడతాడా? అసలు వాడి బట్ట వాడి మొహం మీదే విసిరి కొట్టాల్సింది' అనుకుంది. మరుక్షణం 'అతని మొహం మీద ఈ రోజు విసిరి కొడతావ్. రేపు మరో కస్టమర్ మొహం మీద కూడా కొడతావ్. తర్వాత నీతో కుట్టించుకోడానికి ఎవ్వరూ రారు. కనుక ఎవరేమన్నా..ఎదురు చెప్పకుండా సర్దుకుపో' అని శారద అంతరాత్మ ఆదేశించింది.

'అర్థమైన వాళ్ళకూ మిషన్ ఆడిస్తూ...వాళ్ళు తిడుతూ ఉంటే పడాలా? కుట్టిన జాకెట్టునే పదిసార్లు తిరిగి కుట్టాలా' అనుకుంది. మళ్ళా 'తప్పదు'అని రాజీపడింది.

ఎదురింటి కాంతమ్మగారు, పక్కింటి పద్మావతమ్మగారు వాళ్ళ కుటుంబాలతో కాశీయాత్రలకు వెళ్తున్నామని చెప్పినప్పుడు కామాక్షమ్మ కూడా వాళ్ళతో వెళ్ళడానికి సిద్ధమైంది. "ఒరేయ్! శ్రీధరం...నెల రోజులు ఎలాగో ఒకలాగ హొటల్ మెతుకుల్తో సర్దుకుపోరా" అందామె వెళ్తూ...వెళ్తూ. శ్రీధర్‌కు మాత్రం తల్లి యాత్రకు వెళ్ళడం ఇష్టం లేకపోయినా, తను వెళ్ళ వద్దని చెప్పినా ఆమె వినేలా లేదని తెలియడంతో తల్లితో రాజీ పడిపోయాడు.


నిజానికి కామాక్షమ్మ భర్త పోయి ఐదేళ్ళయింది. ఈ ఐదు సంవత్సరాలలో ఆమె గుమ్మం దాటి ఎక్కడికీ పోలేదు. వయసు కూడా తరుముకు వస్తుంటే పోయేలోగా ఈ జన్మ సార్థకం చేసుకోవాలని కాశీ రామేశ్వరాలు చూడాలనుకుంది కామాక్షమ్మ.

తనెలాగూ తల్లిని యాత్రకు తీసుకు వెళ్ళలేక పోయినా ఆవిడే వెళ్తానంటే కూడా వద్దంటే ఆమె ఎలాగూ ఆగదు. కనుక ఈ విషయంలో తల్లితో సర్దుకుపోక తప్పలేదు శ్రీధర్‌కు.

తల్లి యాత్రకు వెళ్ళినప్పటి నుంచి హొటల్లో టిఫిన్, భోజనం చెయ్యడంతో అటు డబ్బు ఖర్చవడం, ఇటు ఆరోగ్యం చెడిపోవడం రెండూ జరిగాయి. ఉప్పూ కారం లేని తిండితో రాజీ పడ్డాడు శ్రీధరం. ఇంటి దగ్గర రుచులు మరిగిన వ్యక్తి ఇల్లాలు, తల్లి-ఇద్దరూ లేకపోవడంతో కడుపుకు ఏది దొరికితే అదే చాలు అనే స్థితికి వచ్చాడు. ఇంటి దగ్గరైతే వాళ్ళమీద తోక తొక్కిన త్రాచులా లేచి బుస కొట్టేవాడు. హొటల్లో ఎవరి మీదా విరుచుకు పడలేక పోయాడు.

సెలవు రోజుల్లో మరో గత్యంతరం లేకుండా ఒళ్ళు వంచి తనే తన బట్టలు ఉతుక్కుంటున్నాడు. పనిమనిషితో ఒక రోజు బట్టలు ఉతకమంటే తెల్లచొక్కా మీద నీలం పులిమి నాశనం చేసింది. అలాగే పాంట్ ఇస్త్రీ చేసి తీసుకురమ్మంటే నాలుగు రోజులైనా తీసుకురాలేదు. చివరకు కోపం వచ్చి ఒక రోజు

భార్యాభర్తల పోట్లాటలు, కలుసుకోవడాలు వాటి మధ్య మిగిలే తీపి అనుభూతులు దాంపత్య జీవితానికి గుర్తులు. భార్య అలక, భర్త కోపం కూడా వినోదాన్ని కలిగించాలి.




గట్టిగా పనిమనిషిని కేకలువేశాడు. అంతే! పర్యవసానంగా మర్నాడు తన ఇల్లు తనే చిమ్ముకోవలసి వచ్చింది. ఇది ఇలా ఉంటే, మొబైల్ లాండ్రీ వాడు బట్టలను ఇస్త్రీ చెయ్యడానికి పదిసార్లు రమ్మని కబురు చేసినా రాలేదు. చివరకు తనే బట్టలు మూటగట్టి వాడి బండి దగ్గరకు తీసుకు వెళ్ళాడు.

అటు పనిమనిషితోనూ, ఇటు లాండ్రీవాడితోనూ, చివరకు హొటల్ తిండితోనూ రాజీ పడ్డాడు శ్రీధర్. మొదట్లో ఒంటరి జీవితం అలవాటై సరదాగా అనిపించినా పోను పోను జీవితం బరువుగా సాగడం మొదలైంది. కీచులాటలు, దెబ్బలాటలు లేని ప్రశాంతమైన వాతావరణంలో వెలితి కనిపించింది. భార్యా భర్తల పోట్లాటలు, తరువాత కలుసుకోవడాలు, వాటి మధ్య మిగిలే తీపి అనుభూతులు దాంపత్య జీవితానికి గుర్తులు. భార్య అలక, భర్త కోపం కూడా వినోదాన్ని కలిగించాలి.

ఉండగా ఉండగా ఒక రోజు శ్రీధరానికి తల్లి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఇంకా కొన్ని క్షేత్రాలు చూద్దామని నిర్ణయించుకున్నాననీ, కనుక మరో నెలరోజుల దాకా తను రావడానికి వీలు పడదనీ, ఎలాగో ఒకలా సర్దుకు పొమ్మనీ రాసింది కామాక్షమ్మ.

శ్రీధర్ శారదలు చిన్న పిల్లల్లా సిగ్గుపడి పోయారు. "అరెరె! ఇప్పుడు సిగ్గొచ్చిందా, బుద్ధొచ్చిందా'' 'రెండూ' అన్నారిద్దరూ! నవ్వడం ఆమె వంతయింది.



చేతిలో ఉత్తరం పట్టుకుని జిడ్డు మొహంతో కూర్చున్న శ్రీధర్ ఇంటికి వచ్చారు రామానుజం గారు. ఆయన శ్రీధర్ పనిచేస్తున్న కంపెనీలోనే బెంగుళూరు బ్రాంచ్‌లో అకౌంటెంట్. శ్రీధర్ కంపెనీలో చేరిన కొత్తలో అక్కడ ఆయనక్రింద కొంతకాలం పని చేశాడు. ఆయన మీద శ్రీధర్‌కు గురుభావం ఉంది.

చేతిలో ఉత్తరంతో నీరసంగా కూర్చున్న శ్రీధర్‌ను చూసి, ఇంట్లో ఎవ్వరూ లేకపోవడాన్ని అర్థం చేసుకుని మెల్లగా ''విషయమేమిటి?'' అని అడిగారు రామానుజంగారు. మొదట్లో కొంత తటపటాయించినా తర్వాత మెల్లగా తనకూ, తన భార్యకూ ఎప్పుడూ కీచులాటలు రావడం మూలాన ఆవిడ అలిగి పుట్టింటికి వెళ్ళి పోయిందని, తల్లి యాత్రలకు వెళ్ళిందని, నెలరోజుల నుంచీ అడ్డమైన గడ్డీ తింటూ, గుడ్డలు ఉతుక్కుంటూ, లాండ్రీలకు తిరుగుతూ, ఇల్లు చిమ్ము కుంటూ దరిద్రపు బ్రతుకు బ్రతుకుతున్నానని దీనంగా చెప్పాడు శ్రీధర్.

అతని మాటలను ఓపికగా విన్న రామానుజం గారు బిగ్గరగా నవ్వారు. అలా నవ్విన రామానుజం గారిని చూసిన శ్రీధర్‌కు కోపం వచ్చింది.

''ఎందుకండీ ఆ నవ్వు?'' అని అడిగేశాడు.

"మరేం చెయ్యమంటావ్? ఇంత బతకడం చాతకాని వాడినిచూసి నవ్వకుండా ఏడవాలా చెప్పు'' అన్నారాయన.

"అంటే...'' మళ్ళీ కోపంగా అడిగాడు శ్రీధర్.

''కాకపోతే ఏమిటయ్యా? అటు హొటల్ వాళ్ళతోనూ, లాండ్రీ వాళ్ళతోనూ, ఇటు నీ ఆఫీసులోని అడ మేనేజర్ తిట్లతోనూ రాజీపడి, సర్దుకుపోతూ బ్రతికేస్తున్నావు కదా. నిన్ను నమ్ముకుని, తనవాళ్ళను విడిచిపెట్టి, నీకు మెడ వంచి తాళి కట్టించుకుని, కట్నం కానుకలు సమర్పించుకుని నీ గుమ్మంలోకి వచ్చి నీకూ, నీవాళ్ళకూ వండిపెట్టి పరిచర్యలు చేస్తూ, కావలసిన సుఖాన్ని నీకు అందిస్తూ భార్య స్థానాన్ని సంపాదించుకున్న నీ భార్యతో సర్దుకు పోలేక పోయావు. నీ జీవితంలో నీతోబాటు చివరి దాకా నడిచే వ్యక్తి నీ భార్య. ఆమె తప్పు చేస్తే చెప్పాలి. ఒకవేళ మళ్ళీ తప్పు చేస్తే నీ అసంతృప్తిని ప్రకటించాలి. అప్పుడప్పుడూ నీకు నచ్చని పనులు చేస్తే మెత్తగా ప్రతిఘటించాలి.

''అంతే! చిన్న చిన్న విషయాలలో రాజీపడితే పెద్ద పెద్ద దెబ్బలాటలు రావు. చిలికి చిలికి గాలివాన అన్నట్లు, కీచులాటకు ప్రారంభం ఏ చిన్న పనికిరాని విషయమో అవుతుంది. కనుక ఆ విషయాల్లో రాజీపడితే అవాంతరాలను అడ్డుకోవచ్చు... మరోసారి చెప్తున్నా విను.

''అవతలి వారితో రాజీపడే మగవాళ్ళు ఇంట్లో భార్యతో రాజీ పడితే ఆ సంసారం సుఖసంసారం అవుతుంది. అలాగే భార్యలు కూడా భర్తలతో రాజీపడవలసిన విషయాల్లో రాజీపడితే ఆ కాపురం ముచ్చటగా సాగుతుంది. విడిపోయి బ్రతకడం కష్టం కాదు. కలిసి బ్రతకడం కష్టం.. అలా బ్రతకడం లోని మాధుర్యం తెలిసిన వాళ్ళు సర్దుకు పోగలరు.'' ఉపన్యాస ధోరణిలో చెప్పారు రామానుజంగారు.

పెద్దాయన అనుభవం మీద చెప్పిన మాటలు గురించి ఆలోచించాడు శ్రీధర్. ఆలోచించగా, ఆలోచించగా ఆయన చెప్పిందాంట్లో ఎంతో నిజముందనిపించింది. 'సర్దుకుపోవడం...దాంపత్య జీవితానికి ఎంతో అవసరం. ఒకరు మరొకరితో రాజీపడి, సర్దుకుపోయినంత మాత్రాన ఆ ఒకరు ఓడినట్లు మరొకరు గెలిచినట్లు కాదు. ఇది పందెం కాదు... జీవితం. భార్యా భర్తల మధ్య ఎవరు గొప్ప అనే పోటీ కాదు దాంపత్యం. అక్కడ గెలుపు ఓటముల ప్రసక్తే రాదు' అన్న నిజం అతనికి తేట తెల్లమైంది.

ఆలోచనలనుంచి తేరుకుని "నిజమే సార్! మీరన్నది నిజమే. కానీ ఇంత వివరంగా మీరు చెప్పిన తర్వాతే నేనుచేసిన పొరపాటు, పోగొట్టుకున్న జీవితం, పోగొట్టుకున్న దేవరినో అర్థమైంది. ఆరు నెలల నుంచి భార్యకు దూరంగా ఉన్న నాకు అనుక్షణం మరొకరితో సర్దుకు పోవడం తెలిసింది కానీ, నా కోసం ఉదయమే లేచి, ఎన్నో పరిచర్యలు చేసే భార్యతో సర్దుకు పోవాలనే విషయం తెలియక పోయింది. భార్యా భర్తలలో ఎవరికి ఆధిక్యత ఎక్కువ అనే అనుకున్నాను కానీ ఇద్దరూ కలిసి నప్పుడే ఆ కాపురం సవ్యంగా సాగుతుందనే విషయం మరిచిపోయాను సార్'' అన్నాడు శ్రీధర్.

''కనుక...త్వరలో మీ ఆవిడను తీసుకువచ్చేయ్. చెయ్యి జారిపోకముందే సంసారాన్ని చక్కదిద్దుకో... ఎవరు గొప్ప అని పోటీ పడకుండా. సర్దుబాటు లేని సంసారాలు చప్పగా ఉంటాయి... వెలిసిపోయిన చిత్రపటాల్లా...'' అన్నారు రామానుజంగారు.

రామానుజంగారి సలహా మేరకు భార్యను వెంటనే తీసుకువచ్చి కాపురం సరిచేసుకోవాలనుకున్నాడు.

మర్నాడు ఆదివారం అత్తగారింటికి బయలుదేరుతుండగా, వాకిట్లో ఆటో ఆగింది. ''అమ్మ వచ్చేసిందా'' అనుకుంటూ ఆటోలోకి తొంగి చూసిన శ్రీధర్‌కి ఆటోలోంచి దిగుతున్న శారద కనిపించడంతో ఆశ్చర్యం ఆనందం వేశాయి. ఆటోలోంచి దిగిన శారద మనసులో కొంచెం భయం కూడా ఉంది. 'పొగరుగా వెళ్ళావుగా..మళ్ళీ ఏ మొహం పెట్టుకొచ్చావ్' అంటాడేమో. లేకపోతే 'నేను లేకపోతే నీకు దిక్కెవరు' అని వెటకారంగా మాట్లాడుతాడేమో అనుకుంటూ గుమ్మం దగ్గరికి శారద వచ్చినప్పుడు, ఆప్యాయంగా "రా శారదా. నీ ఇంటికి నువ్వొచ్చేశావ్.. నేను కూడా మీ ఊరే బయలు దేరుతున్నాను నిన్ను తీసుకు వచ్చేయాలని... కానీ ఇంతలో నువ్వే''.. అంటున్న శ్రీధర్ మాటలకు అడ్డు తగుల్తూ ''రాజీ పడిపోయానండీ'' అంది శారద.

''నాలాగే కదూ'' అంటూ పూర్తి చేశాడు శ్రీధర్. సరిగ్గా మరో నెల రోజుల తర్వాత యాత్రకు వెళ్ళిన కామాక్షమ్మగారు తిరిగి వచ్చినప్పుడు గుమ్మంలో తనకు స్వాగతం పలికిన కోడల్ని చూసేసరికి ఆనందబాష్పాలు రాలాయి. ఆమె మనసు కుదుట పడింది. యాత్రా ఫలం దక్కిందని సంతోషించిందామె.

కానీ... కామాక్షమ్మది ఆ కాలం తెలివి. ఈ తరంవారి చూపు పది గజాల దూరం వరకు ఉంటుందని కామాక్షమ్మ చెప్పకుండా చెప్పింది. అసలు తను యాత్రకు పోవడంలోనే అంతరార్థం ఉందని శ్రీధర్‌కు తెలియదు.

''ఏరా. మీ ఇద్దరు సర్దుకు పోయారా?'' అడిగిందామె.

శ్రీధర్... శారదలు చిన్న పిల్లల్లా సిగ్గు పడి పోయారు. ''అరెరె! ఇప్పుడు సిగ్గొచ్చిందా? బుద్ధొచ్చిందా?'' అడిగిందామె మళ్ళీ.

''రెండూ'' అన్నారిద్దరూ.

నవ్వడం కామాక్షమ్మ వంతయింది. ●